

# వైభవంగా విజయదశమి

**ఖమ్మం–నవభూమిబ్యూరో:** శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో అమ్మవారు సకల సంపద లక్ష్మీ, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రీరాజరాజేశ్వరీదేవీ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వేళల్లో అమ్మవారి దేవాలయాల్లో శమీ పూజలు వైభవోపేతంగా జరిగాయి. ఖమ్మంలోని జమ్మిబండ వద్ద నిర్వహించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి పారు వేట ఆకట్టుకుంది. తొలుత శ్రీస్తంభాద్రి దేవస్థానం నుంచి స్వామివారు అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మేళతాళాలు, డప్పు నృత్యాల నడుమ పారు వేటకు బయల్దేరారు. నగరంలోని రేవతి సెంటర్, వైరా రోడ్డు, అంబేడ్కర్ సెంటర్ మీదుగా స్వామివారిని ఊరేగింపుగా జమ్మిబండ వద్దకు తీసుకొచ్చారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శమీపూజ వైభవంగా జరిగింది. ఏటా జరిగే నరకాసుర వధ కార్యక్రమాన్ని ఈ ఏడాది జరపలేదు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం దర్శించుకొన్నారు. గుట్టల బజారులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు.


### మున్నేరులో అమ్మవారి విగ్రహం నిమజ్జనం

విజయదశమి వైభవం భద్రాచలం పుణ్యక్షేత్రంలో సాక్షాత్కరించింది. ఈనెల 4న ఆరంభమైన ఉత్సవాలకు శనివారం పూర్ణాహుతి పలికారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీరామ మహా పట్టాభిషేకం కొనసాగించారు. దసరా సంబరాలలో భాగంగా రామాయణ పారాయణం పూర్తిచేసి హోమం నిర్వహించారు. అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయం నుంచి బయల్దేరిన రాములవారు రాజవీధి నుంచి తిరువీధికి వేంచేశారు. దసరా మండపంలో శమీ పూజలు, శ్రీరామ లీలా మహోత్సవాన్ని నిర్వహించారు.


**ఇల్లెందు:** ఇల్లెందు 'మినీ మైసూరు'ను తలపించింది. విజయ దశమి వేడుకలు శనివారం స్థానికే జేకే కాలనీలోని సింగరేణి క్రీడా మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మున్సిపల్ ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ జానీ పాల్గొన్నారు. ఈటీవీ జబర్దస్ ఇమ్మాన్యుయోలు, నూకరాజు, ఫైమా బృందంతో పాటు హైదరాబాద్‌కు చెందిన నృత్య, మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు అలరించాయి.

### కొలువుదీరిన కోటమైసమ్మ

**కారేపల్లి**: దసరాను పురస్కరించుకుని కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీకోటమైసమ్మ జాతర శనివారం వైభవంగా మొదలైంది. వేడుకకు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారామ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు. వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్యలు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకే కారులో బయల్దేరి వస్తుండగా.. జాతరకు సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్ వద్ద వాహనం ఒక్కసారిగా నెమ్మదించింది. దీంతో వెనుక నుంచి వచ్చిన మరో నాలుగు కార్లు ఒకదాన్ని మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.








నవభూమి

జిల్లా అనుబంధం

14 అక్టోబర్,2024 సోమవారం పేజీలు:10

www.epaper.navabhoomi.in


# అనారోగ్య సమస్యలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య



**ఎర్రుపాలెం–నవభూమి:** ఆస్తిపాస్తులకు కొదవలేదు. కానీ వార్ధక్యంలో అనారోగ్య సమస్యలు బాధిస్తుండటం, అవి బాగయ్యే అవకాశం లేదన్న మనస్తాపంతో వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఈ విషాద ఘటన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన ప్రకారం ప్రకారం.. ఎర్రుపాలెం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ధనేకుల సాంబశివరావు(72), సరోజిని(65) దంపతులకు ఇద్దరు సంతానం. వారికి వివాహాలయ్యాయి.

కుమారుడు లండన్‌లో ఉంటుండగా, కుమార్తె విజయవాడలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తాము ఇద్దరం అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి శనివారం రాత్రి సాంబశివరావు దంపతులు గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. తమను కుమారుడు, కుమార్తె బాగానే చూసుకున్నారని లేఖలో పేర్కొన్నారు. ఎవరెవరి నుంచి ఎంత రావాలి? ఎవరికి ఎంత ఇవ్వాలి, ఆస్తి పంపకాల వివరాలను అందులో పేర్కొన్నారు. ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలకు మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై వివరించారు.

# తాగుడుకు డబ్బివ్వలేదని తండ్రినే చంపాడు





**దమ్మపేట–నవభూమి:** చెడు వ్యవసనాలకు బానిసైన కొడుకు.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్నతండ్రిని గొంతు కోసి హత్యచేశాడు.

పోలీసుల కథనం మేరకు.. వడ్లగూడేనికి చెందిన కంభంపాటి సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. డబ్బులివ్వాలని భార్య, కుటుంబ సభ్యులను వేధించేవాడు. మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవటంతో ఆదివారం వృద్ధుడైన తండ్రి కృష్ణయ్య(75)ను అడిగాడు.

తన వద్ద లేవని ఆయన చెప్పటంతో కత్తితో తండ్రి గొంతు కోశాడు. కృష్ణయ్యను హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

### తాలిపేరులో మునిగి ఇద్దరు యువకుల మృతి

**చర్ల–నవభూమి:** గన్నవరానికి చెందిన ఇద్దరు యువకులు తాలిపేరులో పడి మృతి చెందారు. నిమజ్జనం కోసం బతుకమ్మలను శనివారం ఊరేగింపుగా గొంపెనగూడెం వద్ద తాలిపేరు నదికి తీసుకువచ్చారు. నిమజ్జనం అనంతరం యువకులు నదిలో స్నానానికి దిగారు. జంపన్న(20), సోయం మహిధర్(17) నది లోతులోకి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు బయటకు తీసి చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సీపీఆర్ చేసినప్పటికీ ఆ యువకుల ప్రాణాలు దక్కలేదు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

## విప్లవాల ధృవతార ప్రొఫెసర్ సాయిబాబా

### సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ

**టేకులపల్లి అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** పౌరహక్కుల నేత, విప్లవ మేధావి ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా మరణం భారత విప్లవోద్య మానికి తీరని లోటని సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమొక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ అన్నారు. ఆదివారం టేకులపల్లిలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబాను మతోన్మాద మోడీ ప్రభుత్వం ఏడు సంవత్సరాలకు పైగా మహారాష్ట్ర జైలులో నిర్బంధించిందని అన్నారు. 90శాతం అంగ వికలాంగుడైన సాయిబాబాకు కనీసం వైద్య సదుపాయం కూడా కల్పించకుండా మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. ఇటీవల జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత తాను ఏర్పాటుచేసిన ఆత్మీయుల సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ తనశక్తి మేరకు వ్యవస్థ మార్పునకు కృషి చేస్తానని అన్నారని గుర్తు చేశారు. సాయిబాబా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం గుండె పోటుతో మరణించారని అన్నారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. సాయిబాబా మృతికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు సానుభూతిని తెలియజేశారు. దోపిడి వ్యవస్థ నిర్మూలనకై నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కొరకు, మతోన్మాద పాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమే సాయిబాబాకు నిజమైన నివాళి అర్పించిన వాళ్ళమవుతామని అన్నారు.

## విజయ దశమి ప్రజల జీవితాల్లో సంతోషాన్ని నింపుతుంది

### రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

**పాల్వంచ అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** విజయదశమి, దసరా పండగలు తెలంగాణ రాష్ట్ర ప్రజల, రైతు సోదరుల జీవితాల్లో సంతోషాన్ని నింపుతుందని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. దసరా సందర్భంగా శనివారం కొత్వాల పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం లో గల పెద్దమ్మతల్లి కి, సూరారం లోగల నర్సమ్మతల్లి కి, పాత పాల్వంచ లోని మైసమ్మతల్లి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. గత తొమ్మిది రోజులుగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరుపుకొని, దసరా పండుగ రోజు ప్రజలందరూ తమ కుటుంబసభ్యులతో ఆనందంగా, ప్రశాంతంగా గడపాలని అమ్మవారిని వేడుకున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, బానోత్ బాలాజీ, గంధం నర్సింహారావు, కామచారి, చౌగాని పాపారావు, జామ్లా, శంకర్, భావ్ సింగ్, జక్కుల, మసనం శరత్, వంగా రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## వెంకటేశ్వర స్వామి ఆలయంలో

# ఘనంగా దసరా వేడుకలు

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 13 :** తెలంగాణ తిరుపతిగా పేరుపొందిన జమలాపురం స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆశ్వీజ శుద్ధ దశమి దసరా సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు శమీపూజ కార్యక్రమాలను ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు.శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవము లలో భాగంగా శనివారం ఉదయం 5 గంటల నుండి స్వామి వారికి అమ్మవార్ల కు నిత్యపూజ కార్యక్రమ ములు,ప్రత్యేక పూజలు, హోమములు,గోపూజలు నిర్వహించారు.అమ్మవారి ని రాజరాజేశ్వరి దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో,ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.భట్టి విక్రమార్క స్వామివారి ఆలయంతో పాటుగా వినాయకుని ఆలయం,ఆంజనేయ స్వామి,అలివేలు మంగ అమ్మవారు,శివాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.పూజలు అనంతరం స్వామివారి మహామండపంలో వేద పండితులు,అర్చకులు భట్టి విక్రమార్కకు ఆశీర్వచనం చేసి స్వామి వారితీర్థ ప్రసాదములను శేష వస్త్రాలను అందించారు.పద్మావతి దేవి ఆలయంలో అమ్మ వారికి అర్చకులు మార్తి రఘురామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో విజయ దశమి సందర్భంగా అమ్మవారికి పుష్పా లంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి ఆలయంలో శమీపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులు, గ్రామస్తులు ఈ శమీ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి,ఆలయ పర్యవేక్షకులు కే విజయ కుమారి,ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ దంపతులు,రాజీవ్ శర్మ,వెంకటరమణ, సుదర్శనశాస్త్రి,రఘు రామకృష్ణ శాస్త్రి,చక్రధర్, రామకృష్ణ శాస్త్రి,శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.





## పూర్ణచంద్రారెడ్డిని

# అభినందించిన మల్లు నందిని

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 13:** మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన యరమల పూర్ణచంద్రారెడ్డి తాను పుట్టిన గ్రామానికి సొంత నిధులతో చేస్తున్న సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. శనివారం భీమవరం గ్రామానికి విచ్చేసిన మల్లు నందినికి కేపిఆర్ హోమ్స్ అధినేత పూర్ణచంద్రారెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పెద్దఎత్తున మేళతాళాలు,గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు.ఆమె గ్రామ మహిళలతో కలిసి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,బతుకమ్మ ఆటలు ఆడారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో పూర్ణచంద్రారెడ్డి తన సొంత స్థలాన్ని ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున 8 మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను మల్లు నందిని చేతుల మీదగా అంద జేశారు.ఈ సందర్భంగా ? నందిని మాట్లాడుతూ భీమవరం గ్రామంలో వర్గ విభేదాలు ఉద్రిక్తత్తలు ఉంటాయని అలాంటి గ్రామంలో విజయదశమి రోజు ప్రశాంతంగా గ్రామస్తులందరూ ఇంత మంచి కార్యక్రమాలు నిర్వహించుకోవడం శుభ పరిణామం అన్నారు.ప్రతి ఒక్కరికి జీవితంలో సొంత ఇంటికల ఉంటుందని అలాంటి కలను పూర్ణచంద్రారెడ్డి తాన గ్రామంలోని బలహీన వర్గాల పేదవారికి తన సొంత స్థలంలో ఇంటి పట్టాలను అందించడమే కాకుండా చుట్టూ ప్రహరీని నిర్మించి,బోరు వేయించి మౌలిక వసతులను అందించడం చాలా గొప్ప విషయం అన్నారు.భూమి వాటాల విషయంలో గెట్ల వద్ద అన్నదమ్ములు సైతం గొడవపడే ఈ రోజుల్లో ఇలాంటి వ్యక్తులు ఉండటం అరుదు అన్నారు.ఇళ్ళ పట్టాలు పొందిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని మాట ఇచ్చారు.గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజానీకం చాలా ఇబ్బందులు పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సారధ్య%శీ%లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం,గ్యాస్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలతో పాటు భట్టి విక్రమార్క కలల ప్రాజెక్టు ఇందిరా డెయిరీని కూడా ప్రారంభించడం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పథకాలతో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ తాను పుట్టిన ఊరు బాగు కోసం రాజకీయాలకు అతీతంగా పేదలకు ఉపయోగపడే విధంగా సేవా కార్య క్రమాలు చేయటం జరుగుతుందన్నారు.పేద ప్రజల అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు రామారావు, వేజెండ్ల సాయికుమార్, శీలం శారద,అనుమోలు శ్రీదేవి,గుర్రాల శ్రీనివాసరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి, శీలంలింగారెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ సాయిబాబాకు విప్లవ జోహార్లు

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 13 :** ప్రొఫెసర్ సాయిబాబా శాస్త్ర చికిత్స పొందుతూ హైదరాబాదులో నిమ్స్ హాస్పటల్లో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం దేశానికి,పౌరులకు, ఆదివాసులకు, దళితులకు, మైనారిటీల కు,పేద వర్గాలకు, కార్మిక వర్గానికి తీరని నష్టమని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు గంటా శ్రీనివాస్, కల్లూరు డివిజన్ నాయకులు అమర్లపూడి శరత్, మండల కార్యదర్శి తాటి రాజు అన్నారు. ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ విప్లవ జోహార్లు అర్పిస్తున్నామన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా అట్టడుగు పేద వర్గాలలో జన్మించారన్నారు. 90 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగాడన్నారు. మార్క్సిస్టు దృక్పథంతో పాలకవర్గాల దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారన్నారు. పౌర హక్కుల కోసం ఆదివాసులు, దళితుల హక్కుల కోసం ధైర్యంగా నిలబడి పోరాటాలు నిర్వహించారన్నారు. మోడీ నాయకత్వంలోని బి జె పి ప్రభుత్వం సాయిబాబాను అర్బన్ నక్సలైట్ గా ముద్ర వేసిందన్నారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని అంగవైకల్యాన్ని సైతం గుర్తించకుండా అక్రమంగా అరెస్టు చేసే ఎనిమిది సంవత్సరాలు నాగపూర్ జైల్లో అండర్ ట్రైల్ సెల్లో ఖైదీగా నిర్బంధించిం దన్నారు. అప్పటినుంచి కనీస వైద్య సౌకర్యాలు అందించకపోవడం తో ఆయన ఆరోగ్యం క్షీణించిందన్నారు. చివరి దశలో బెయిల్ పై విడుదలైనప్పటికీ అనారోగ్య సమస్యలు వేధించాయన్నారు. వైద్యం చేయించుకోవడానికి నిమ్స్ హాస్పిటల్ లో చేరారన్నారు. చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం దురదృష్టకరమన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణం దేశానికి, అన్ని వర్గాలకు తీరనిలోటన్నారు. సాయిబాబా విషయ పరిజ్ఞానంతో ప్రభుత్వంతో ఉత్పన్నమయ్యే అంశాలను విశ్లేషించే వాడన్నారు. అనగారిన ప్రజలను చైతన్యపరిచారన్నారు. రచయితగా ,కవిగా, మంచి ఉపన్యాసకులుగా ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. ఆంగ్ల విద్యలో మంచి ప్రావీణ్యం కలిగిన స్నేహశీలి అన్నారు. ఆయన తల్లి జైల్లో ఉన్నప్పుడే క్యాన్సర్ వ్యాధితో మరణించారన్నారు. భార్య వసంత,కూతురు ఉన్నారన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని, సంతాపాన్ని తెలుపుతున్నామన్నారు.

## ప్రొఫెసర్ సాయిబాబా మృతి భారత సమాజానికి తీరని లోటు

### సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా



**టేకులపల్లి అక్టోబరు 13 నవభూమి ప్రతినిధి :** పౌర హక్కుల కోసం, దేశం మార్పు కోసం పరితపించిన ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మృతి భారత సమాజానికి తీరని లోటని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా టేకులపల్లి మండల ప్రధాన కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి పేర్కొన్నారు. సాయిబాబా మృతికి తీవ్ర సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తమ పార్టీ తెలియజేస్తున్నదని ఆయన తెలిపారు. సాయిబాబా మరణించడం అంటే అక్షరాల కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా అరాచకంగా హత్య చేయడమేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆయన మృతికి మోడీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. 90 శాతానికి పైగా వికలాంగుడైన సాయిబాబా ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నించాడని ఆరోపించడం కేంద్రం చేసిన దివాళాకోరు తనానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. ఎటువంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా ఏడు సంవత్సరాలకు పైగా సాయిబాబాను అండాకారాగారంలో అక్రమంగా నిర్బంధించి, కేంద్రం తన పాసిజాన్ని, అరాచకాన్ని నిరూపించుకుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయిబాబాను నిర్బంధించడం అంటే యావత్ భారతదేశం పౌరుల హక్కులను నిర్దాక్షిణ్యంగా, నిరంకుశంగా కాలరాయడమేనని ఆయన పేర్కొన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా తన జీవిత పర్యంతం సమాజ మార్పు కోసం, సమ సమాజ స్థాపన కోసం, సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడారని, ఆ క్రమంలో తన జీవితాన్ని త్యాగం చేశారని, సాయిబాబాకు వీరబ్రహ్మాచారి నివాళులు అర్పించారు.


## హైకోర్టు ఆదేశాలు ఉద్యాన శాఖ

# అమలు చేయాలి

- భార్య చనిపోయిన దుఃఖంలో ఉన్న రైతు
- రైతు పుచ్చకాయల సోమిరెడ్డి ఆవేదన
- మానవత్వం మరిచిన అధికారులు
- బాసటగా నిలిచిన రైతు సంఘాలు







**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 13 :** పామాయిల్ ఆఫ్టైప్ మొక్కల బాధిత రైతు పుచ్చకాయల సోమిరెడ్డి కుటుంబానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉద్యాన శాఖ అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం కోరుతోంది. పామాయిల్ తోటకు జరిగిన నష్టాకి ఆందోళనకు గురైన పుచ్చకాయల చెల్లమ్మ ( సోమిరెడ్డి భార్య) అక్టోబర్ 2న గుండెపోటుతో మరణించారన్నారు. అయినప్పటికీ ఉద్యాన శాఖ అధికారులకు చీమకుట్టినట్టుగా కూడా లేదని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవత్వం మరిచి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. పామాయిల్ ఆఫ్టైప్ బాధిత రైతుకి రూ.60 లక్షల నష్టపరిహారం అందించే విషయంలో హైకోర్టు ఆదేశాలను ఉద్యాన శాఖ అమలు చేయాలని కోరుతున్నారు. రైతు కుటుంబం పై వేదింపులు ఆపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాదిత రైతు పుచ్చకాయల సోమిరెడ్డి తో అయిల్ ఫెడ్ పామాయిల్ గ్రోయర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుంబరు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, రైతులు చెలికాని సూరిబాబు, దొడ్డ చక్రధర్‌రెడ్డిలతో కలసి విలేకరులతో మూడ్ శోభన్ మాట్లాడుతూ పుచ్చకాయల సోమిరెడ్డి కుటుంబం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో 12 ఎకరాల వ్యవసాయ భూమిలో 2018 సంవత్సరంలో తెలంగాణ ఆయిల్ఫెడ్ నర్సరీలో పెంచిన 618 పామాయిల్ మొక్కలు తీసుకుని నాటుకున్నారన్నారు. మొక్కలు నాటిన మూడు సంవత్సరాల తరువాత గెలలు కొన్ని పామాయిల్ చెట్లకు రావటం ప్రారంభమైందన్నారు. సుమారు 400 చెట్లు ఆరోగ్యంగా వుండి పామాయిల్ పండ్ల గెలలు కాయకుండా ఖాళీ గెలలు (పోతు గెలలు), అతి చిన్న గెలలు కాస్తున్నాయన్నారు. ఈ సమస్యను ఆయిల్ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. అధికారులు పామాయిల్ తోటలోకి వచ్చి క్షేత్ర పరిశీలన చేసారన్నారు. ఆయిల్ఫెడ్ అధికారుల సూచనతో సుమారు 100 చెట్లను తొలగించారు. వారి సూచనలతో తొలగించిన పామాయిల్ చెట్ల విస్తీర్ణం సుమారు 2 ఎకరాల వరకు వుంటుందన్నారు. 100 చెట్లు తొలగించిన తరువాత సైతం పామాయిల్ తోటలోని అధికారుల సూచనతో తొలగించిన పామాయిల్ మొక్కల లక్షణాలున్న చెట్లు ఇంకా 400 వరకు వున్నాయన్నారు.కొంత మంది అనుభవజ్ఞులైన రైతులకు తోటను చూపించిన తరువాత అవి హాఫ్ టైప్ (నపుంశక) మొక్కలని తెలుసుకున్నారన్నారు. ఈ సమస్యను ఆయిల్ఫెడ్, ఉద్యాన అధికారులకు వినతిపత్రం ద్వారా తెలియచేసారన్నారు. కొంత కాలానికి ఖమ్మం జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెదవేగిలో వున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఆయిల్ ఫామ్ రిసెర్చ్ కు చెందిన సీనియర్ సైటింస్ట్ డాక్టర్ ప్రసాద్ లు వచ్చి పామాయిల్ తోటను పరిశీలించి నివేదిక ఇచ్చారన్నారు. ఈ నివేదిక ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని ఆయిల్ఫెడ్ యాజమాన్యాన్ని వ్రాతపూర్వకంగా కోరటం జరిగిందన్నారు . దీని ప్రతిని ఉద్యాన సంచాలకులకు సమర్పించారన్నారు. ఆయన వినతిపై ఆయిల్ఫెడ్, ఉద్యాన అధికారులు స్పందిచకపోవడంతో విదిలేని పరిస్థితిల్లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారన్నారు. తెలంగాణ హైకోర్టులో డబ్ల్యూపి/23358/2024 కేసు వేయడం జరిగిందన్నారు . ఈ కేసులో గౌరవనీయులైన న్యాయమూర్తి సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా 15 రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయటం జరిగింది అన్నారు. కోర్టు ఆర్డరు కాఫీని జత చేసి 12.09.2024 న్యాయం చేయాలని ఉద్యాన శాఖ అధికారులను రైతు విన్నవించారన్నారు. ఆయన వినతిపై తేది.27.09.2024న తెలంగాణ ఆయిల్ఫెడ్ మేనేజింగ్ డైరక్టర్ యాస్మిన్ బాషా రైతును హైద్రాబాద్ లోని పరిశ్రమ్ భవన్ లో ఉన్న కార్యాలయానికి హాజరవ్వాలని నోటీసులు ఇచ్చారన్నారు. రైతు భార్య చెల్లమ్మ అనారోగ్య కారణంగా రైతు తరుపున ఆయన కుమారుడు పుచ్చకాయల రమేష్ రెడ్డి తేది.27.09.2024న హైద్రాబాద్ లోని ఆయిల్ఫెడ్ కార్యాలయానికి హాజరై జరిగిన నష్టాన్ని మౌఖికంగాను, వ్రాత పూర్వకంగా వివరించడం జరిగిందన్నారు. తేది.02.10.2024న రైతు భార్య చెల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారన్నారు. తేది.03.10.2024న ఈ విషయాన్ని ఆయిల్ఫెడ్ అధికారులు ఉన్న పామాయిల్ రైతుల వాట్సప్ గ్రూపుల్లో తోటి రైతులు పోస్టింగులు పెట్టడం జరిగిందన్నారు. కొంత మంది అధికారులు తమ సంతాపాన్ని సైతం ఆ వాట్సప్ గ్రూపుల్లో తెలిపారన్నారు.03.10.2024న ఆయిల్ఫెడ్ అశ్వారావుపేట డివిజినల్ మేనేజర్ బాలక్రిష్ణ, 09.10.2024న హైద్రాబాద్లో ఆయిల్ఫెడ్ మేనేజింగ్ డైరక్టర్ ఎదుటు రైతును, రైతు భార్య చల్లమ్మలను హాజరుకావాలని నోటీసులను బాలక్రిష్ణ స్వహస్తాలతో రైతుకు అందచేసారన్నారు. రైతు భార్య చల్లమ్మ చనిపోయిన విషయం తెలిసి కూడా రైతును వేదించడానికి రైతు భార్య చనిపోయిన 6 రోజులకే హైద్రాబాద్ లో ఉన్న ఆయిల్ఫెడ్ కార్యాలయానికి రావాలని నోటీసివ్వడం న్యాయమ న్నారు. కోర్టుకెళ్లినందుకు రైతు కుటుంబాన్ని ఆయిల్ ఫెడ్ ఉన్నతాధికారులు వేదిస్తున్నారన్నారు. రైతు భార్య చనిపోయిన విషయం తెలిసినా ఆయిల్ఫెడ్ మేనేజింగ్ డైరక్టర్ దృష్టికి తీసుకువెళ్లలేదన్నారు. మేనేజింగ్ డైరక్టర్ తరువాతి స్థానంలో వున్న అధికారులు మానవత్వం మరచి రైతును మానసికంగా వేదిస్తున్నారన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 13:**మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రంథాలయానికి భీమవరం గ్రామానికి చెందిన కెపిఆర్ హోమ్స్ అధినేత యరమల పూర్ణచంద్రారెడ్డి గ్రూప్స్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థుల కోసం 12 వేల రూపాయలు విలువచేసే పుస్తకాలను ఆదివారం జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయానికి అందించారు.ఈ సందర్భం గా పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు,యువత లక్ష్యంతో కష్టపడి చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని సూచించారు.అనంతరం గ్రామస్తులు యరమల పూర్ణచంద్రారెడ్డిని పూల మాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగా పుల్లా రెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి,యన్నం పిచ్చిరెడ్డి,పూర్ణచంద్రారెడ్డి, యన్నం సత్యనారాయణ రెడ్డి,వేమిరెడ్డి వెంకట రెడ్డి, బొగ్గుల రామచంద్ర రెడ్డి, ఖమ్మం పాటి లక్ష్మణ్, వేమిరెడ్డి రామిరెడ్డి,నరాల సాంబశివారెడ్డి,వెదురు కృష్ణారెడ్డి,తల్లపురెడ్డి వెంకటరెడ్డి,కోనసాయి , శివ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నిశ్చయతాంబూల కార్యక్రమం పాల్గొన్న రాఘవ

## కాబోయే వధూవరులను ఆశీర్వదించన ఎడవల్లి, వనమా రాఘవ





**పాల్వంచ అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గగనం శ్రీనివాస్ ఏకైక కుమార్తె శ్వేత నిశ్చయతాంబూల కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధి లో గల జై జగదాంబ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ నిశ్చయతాంబూల కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన పలువురు పాత్రికేయులు పాల్గొని కాబోయే నూతన జంట ను అశ్వరాధించారు. కాంగ్రెస్ నాయకులు ఏడవల్లి కృష్ణ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేంద్రరావు లు పాల్గొని కాబోయే వధూవరులను అశ్విరదించారు. అదే విదంగా కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి లు పాల్గొని జంటను అశ్విరదించారు. తన సహచరుడు, మిత్రుడు గగనం శ్రీనివాస్ కూతురి నిశ్చయతాంబూల కార్యక్రమంలో పాల్వంచ కు చెందిన సీనియర్ పాత్రికేయులు, నవభూమి ప్రతినిధి ఎండి జైనుల్లా బుద్దీన్, యుటిఎఫ్ నాయకులు బండి జానకి రాములు, శ్రీను, ప్రెస్ క్లబ్ భాద్యులు కొండలరావు, సంజీవ్, చంద్ర నరసింహరావు,సుభాని,రజాక్‌లు పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్, నాయకులు

**చంద్రుగొండ అక్టోబర్ 12 నవభూమి:** మండల పరిధిలోని మద్దుకూరు గ్రామంలో విజయదశమి నవరాత్రుల భాగంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించిన గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుంద్రు విజయ్ దుర్గాప్రసాద్, అనంతరం దుర్గామాత ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్దం నీలమ్మ, సలవాది జానకి, మన్నెవీరేంద్ర, కోడం రాంబాబు, అద్దం కృష్ణ, పద్దం సాంబశివరావు, మాచినేనిశ్రీను, పదం నాగరాజు, కుంజ అశ్విని, మహిళలు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.





## పాల్వంచలో తొలిగించిన పవర్ ప్లాంట్ల స్థానంలో

# నూతన ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

◆ కెటిపిఎస్ కొత్త ప్లాంట్ల సాధన సమితి

**పాల్వంచ అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** ఒక నాడు పారిశ్రామిక ప్రాంతంగా ఎంతో అభివృద్ధి ని సాధించి, రాష్ట్రంలోనే మంచి పేరు ప్రఖ్యాతులు సాధించి, కళ కళ లాడిన పాల్వంచ, నేడు పరిశ్రమల మూత తో అభివృద్ధి అంతా కుంటు పడిపోయి, వెల వెల పోతుందని ఇదే పరిస్థితి కొనసాగితే పాల్వంచ అభివృద్ధి ప్రశ్నర్ధకంగా మారె అవకాశముందని కెటిపిఏస్ కొత్త ప్లాంట్ల సాధన సమితి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఆదివారం అంబేద్కర్ సెంటర్ లోని ఓ హెూటల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో వారు మాట్లాడుతూ నానాటికి కుంటు పడుతున్న పాల్వంచ అభివృద్ధి విషయం పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కెటిపిఏస్ లో ఇటీవలే తొలగించిన పాత యూనిట్ల స్థానంలో కొత్త యూనిట్లను నిర్మించే విషయం పై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. 1965 నుండి 78 వరకు అంచె లంచేలుగా కెటిపిఏస్ నిర్మాణం జరుపుకుంటూ ఏ, బి, సి, విద్యుత్ ఉత్పత్తి స్టేషన్ల ను ఏర్పాటు చేసుకోవటం జరిగిందన్నారు. ఇటీవలే వాటిని కాలం చెల్లిన వాటి కింద పరిగనించి కూల్చి వేశారని అన్నారు. వాటిని కూల్చి వేయటంతో సుమారు ఐదు వందల ఎకరాల భూమి ఖాళీ గా ఉందని అన్నారు. కూల్చి వేసిన వాటి స్థానంలో కొత్తగా 800 వందల మేఘవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్ధ్యం కలిగిన ప్లాంటలను నిర్మించాలని అన్నారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన భూమి, బొగ్గు, నీరు, రైల్వే లైన్లు అందుబాటులో ఉండటం తో ప్లాంట్ల నిర్మాణ ఖర్చులు కూడా తగ్గే అవకాశ ముందన్నారు. ఇప్పటికే ఏపీ స్టీల్స్, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు మూత పడటం తో పాటు కె టి పి ఏస్ పాత ప్లాంట్ ను కూల్చటం తో పాల్వంచ అభివృద్ధి కుంటు పడి పోయిందన్నారు. అనేక మంది కార్మికులు తమ జీవనోపాది కోల్పోయరన్నారు. ప్లాంట్ల కూల్చి వేత తో చాలా మంది కార్మికులు, ఉద్యోగులు బదిలీ అయి పాల్వంచ వదిలి వెళ్లారన్నారు. రామగుండం లో సింగరేణి సహకారం తో జెన్ కో యాజమాన్యం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించే దిశ లో అడుగులు వేస్తుందని, అదే తరహా లో కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 2ఇంటు 800 సామర్ధ్యం కలిగిన పవర్ ప్లాంట్ లను, ఎంతో అనుభవం ఉన్న జెన్కో కు అవకాశం కల్పించాలన్నారు. ప్లాంట్ల నిర్మాణ విషయం పై పట్టణ, గ్రామీణ





ప్రాంతాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు అయి, ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను సాధించి, పాల్వంచ కు పూర్వ వైభవం తీస్కొని వచ్చేందుకు అందరు సహకరించాలన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో కెటిపిఏస్ కొత్త ప్లాంట్ల సాధన సమితి సభ్యులు మహిపతి రామలింగం, డాక్టర్ బిక్కసాని సుధాకర్ రావు, అడ్వకేట్ జలసూత్రం శివరాంప్రసాద్, ఎం రాజుగౌడ్, అడ్వకేట్ తోట కోటేశ్వరరావు, ఏస్వీఆర్కె ఆచార్యులు, ఎర్రగుంట సాంబశివరావు, ఏస్ కె సైదులు, పి వి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# గార్లలో త్రివర్ణ పతాకావిష్కరణ

**గార్ల, నవభూమి, అక్టోబర్ 13 :** మత సామరస్యానికి ప్రతీకగా జాతి సమైక్యతా భావాన్ని, దేశభక్తిని మననం చేసుకుంటూ అందుకు చిహ్నంగా విజయదశమి పర్వదినమైన శని వారం మహబూబాబాద్ జిల్లా మండల కేంద్రమైన గార్లలో మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి మంగమ్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిజాం నవాబు కాలం నుంచి వస్తున్న ఆనవాయితీని నేటికీ అమలు చేస్తూ నాడు నవాబు ఏ విధంగా కార్యక్రమాలు నిర్వహించారో అదే రీతిలో నేడు గార్ల లో ఆచరిస్తున్నారు. నిజాం నవాబు కాలంలో శాంతి భద్రతల నిర్వహణకు గార్ల మసీదు పక్కన పోలీస్ ఠాణా ఏర్పాటు చేశారు.ఠాణా వెనుక మైసమ్మ గుడి ఉండేది. ప్రతి సంవత్సరం విజయదశమి రోజున పోలీస్ ఠాణాలో ఆయుధ పూజ అనంతరం మైసమ్మ వద్ద మేకపోతును బలిచ్చి ముస్లిం సంప్రదాయం ప్రకారం మసీదు ఎదురుగా నిర్మించిన గద్దెపై పచ్చజెండా ను ఎగురవేసి ఆ తర్వాత అక్కడికి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన జమ్మి పూజ కు వెళ్లేవారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజా పాలన ఏర్పడడం ఎన్నికలకు ప్రజల సమాయత్తం కావడం నిజాం నవాబు కాలం నుంచి ఉన్న టౌన్ మున్సిపాలిటీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా 1952లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కమ్యూనిస్టు అభ్యర్థిగా మాటేటి కిషన్ రావు చైర్మన్ ఎన్నికయ్యారు. నాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ల లను తిరస్కరించారు. మసీదు సెంటర్ లోని జెండా గద్దె వద్ద పతాకాన్ని ఆవిష్కరించి విషయంలో కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో నాటి టౌన్ మున్సిపాలిటీ సభ్యులు సమావేశమై దేశ భక్తికి చిహ్నంగా జాతీయ జెండాను ఎగురవేయాలని నిర్వహించారు ఆరేళ్లపాటు జరిగిన ఈ ఘర్షణ తెరపడగా 1958లో మొదటి చైర్మన్ కిషన్ రావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. గార్ల టౌన్ మున్సిపాలిటీ కాస్తా మేజర్ గ్రామ పంచాయతీగా రూపాంతరం చెందటంతో పంచాయితీ ప్రతి ప్రథమ పౌరుడైన సర్పంచ్ అదే సంప్రదాయాన్ని అమలు చేస్తున్నారు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి జాతీయ జెండాను టపాసులు కాలుస్తూ నృత్యాలు చేస్తూ మేళతాళాల మధ్య గార్ల పురవీధుల్లో ఊరేగించి గద్దె వద్దకు చేరుస్తారు. అనంతరం నాటి ఆచారం ప్రకారం జెండాను మంగమ్మ ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, స్థానిక మండల ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.ఘనంగా దసరా వేడుకలు విజయదశమి వేడుకలను మండలం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తలంటు స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి వివిధ దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.సాయంత్రం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం జమ్మి పూజ అనంతరం పాలపిట్ట దర్శనం చేసుకున్నారు.



# అమ్మవారి మండపంలో అన్నదానం

## పాల్గొన్న 15 వందల మంది భక్తులు





**పాల్వంచ అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** పట్టణ పరిధి లోని శాస్త్రి రోడ్ లో గల గాంధీ బొమ్మ వద్ద నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద ఆదివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 15 వందల మంది భక్తులు పాల్గొని, అమ్మవారి ప్రశాదాన్ని స్వీకరించినట్లు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదాన అనంతరం అమ్మవారి పూజ లోని పట్టు వస్త్రాలు, లడ్డూ ప్రసాదం, హుండీలను వేలం పాట నిర్వహించినట్లు నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు సేవ చేసే అదృష్టం కలగటం పూర్వ జన్మ సుకృతమే అన్నారు. అందరికి ఈ లాంటి అదృష్టం లభించదన్నారు. అమ్మవారి కృప సర్వ మానవాళి పై ఉండాలన్నారు. అమ్మవారి దయచేసి ఉంటే అన్ని ఉన్నట్లే నన్నారు. అనంతరం కమిటీ సభ్యులు వర్తక సంఘం కన్వీనర్ చాలువాది ప్రకాష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ కమిటీ సభ్యులు సంపత్ మంత్రి, దోమల ప్రవీణ్, చలువాది ప్రకాష్, శివ సాంబ మూర్తి, జయాకర్ రెడ్డి, మంగా రావు, దోమల కిషోర్, ఆదేపు నాగరాజు, లింగా రమేష్, కొప్పరపు వీరబాబు, ఇందిర, మల్లీశ్వరి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కల్లోజీ మాతృ మూర్తికి ఘననివాళి

**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** ప్రముఖ జర్నలిస్ట్ నాయకుడు కల్లోజీ శ్రీనివాస్ మాతృమూర్తి జయమ్మ ఆకస్మిక మరణానికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలో కల్లోజీ ఇంటి వద్ద జయమ్మ (84)పార్ధీవ దేహానికి వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్ నాయక్, కోరం కనకయ్య,సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ, చింతలపూడి రాజశేఖర్, తూము చౌదరి, జగన్, సహకార సంఘం అధ్యక్షులు మండే వీర హన్మంత రావు,పూనేం శ్రీను, విలేకరులు, ప్రముఖులు తదితరులు నివాళి అర్పించారు.





## మహిళలను మహాలక్ష్మిలుగా

# తీర్చిదిద్దుతాము:భట్టి విక్రమార్క

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 12:** మండల కేంద్రం ఎర్రుపాలెంలో పాలశీతలీకరణ ఇందిరా మహిళా డైరీ యూనిట్ ను శనివారం డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులతో కలిసి ప్రారంభించారు. తొలుత ఆయన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.డైరీ ప్రారంభించిన అనంతరం ఐకెపి కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళలను మహాలక్ష్మిలుగా ప్రజా ప్రభుత్వంలో తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు.మధిర నియోజకవర్గంలో విజయదశమి రోజున మొదలు పెట్టిన ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు విజయవంతమై దేశానికి ఆదర్శంగా నిలుస్తుంద న్నారు.మొత్తం మహిళలతో నిర్వహించే ఇందిరా మహిళా డెయిరీ పరిశ్రమను సందర్శించ డానికి దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి అధికారులు,మహిళా సంఘాల సభ్యులు క్యూ కడుతారని తెలిపారు. ఇందిరా మహిళ డెయిరీ ఏర్పాటుతో మధిర నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను వ్యాపార వేత్తలుగా ప్రజా ప్రభుత్వం తయారు చేయబోతున్నద న్నారు.మహిళలతో కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి ఇందిరా మహిళా డెయిరీని చాలా పకడ్బందీగానిర్వహిస్తామని తెలిపారు.పాల ఉత్పత్తి, పాల సేకరణ,పాల అమ్మ కాల ద్వారా వచ్చే ప్రతి పైసా మహిళా సభ్యులకే చెందే విధంగా ప్రాజెక్టును రూపకల్పన చేశామని అన్నారు.పాల ఉత్పత్తి చేయడానికి నియోజక వర్గంలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రెండు గేదెలను పంపిణీ చేస్తుందని,మండలంలో ఉన్న నిరుద్యోగులను ఎంపిక చేసుకొని వారికి కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పించి గేదెలకు కావలసిన వరి గడ్డి,పచ్చి గడ్డి,దాణాను ఇంటింటికి సరఫరా చేయిస్తామని అన్నారు.ప్రతి గేదెకు హెల్త్ కార్డు ఏర్పాటు చేయించి సక్రమంగా వైద్యం అందే విధంగా చర్యలు చేపడతమని తెలిపారు.దృఢమైన సంకల్పంతో మీరందరూ సమిష్టిగా పనిచేస్తే ఈ ప్రాజెక్టు విజయాన్ని ఎవరు ఆపలేరని విజయం మీకే చెందుతుందన్నారు.వ్యవసాయ ఆధారితమైన మధిర నియోజకవర్గంలో కేవలం వ్యవసాయం ద్వారా మాత్రమే ఆర్థిక సంపద పరిమితం కావొద్దని భావించి ప్రత్యామ్నా యంగా ఆర్థిక వనరులు సమకూర్చ డానికి చేసిన ఆలోచనల నుంచి వచ్చినదే ఇందిరా మహిళ డెయిరీ ప్రాజెక్ట్ అని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ గా ఉన్నప్పుడు 2010లో ఈ ప్రాజెక్టు గురించి నేను ఆలోచన చేశానని, 2011-12 సంవత్సరంలో ఈ ప్రాజెక్టును ప్రజల ముందుకు తీసుకువచ్చా వచ్చానని తెలియజేశారు.గుజరాత్ రాష్ట్రంలోని అమూల్,ముల్కనూరు డెయిరీ పరిశ్రమలకు నియోజకవర్గం నుంచి మహిళలను పెద్ద ఎత్తున పంపించి అధ్యయనం చేయించడం జరిగింది.ప్రజా ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఉప ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేను మొదటి ప్రాధాన్యతగా పెండింగ్లో ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేసే కార్యక్రమం మొదలు పెట్టాను.మహిళలను మహాలక్ష్మిలుగా తీర్చిదిద్దుతామని ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ హామీలను ఇచ్చిందని,అధికారంలోకి రాగానే వాటిని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్న డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 400 కోట్ల రూపాయలను ఆర్టీసీకి





చెల్లిస్తున్నట్లు తెలిపారు.నియోజకవర్గం లోని 238 గ్రామ సంఘాలు 5884 స్వయం సహాయక సంఘాల గ్రూపులు, 61,409 మంది సభ్యులు ఏదో ఒక వ్యాపారం చేసే విధంగా వడ్డీ లేని రుణాలను ఇచ్చి ఆర్థికంగా నిలబెట్టడానికి ప్రజా ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రతి సంవత్సరం 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని,ఐదు సంవత్సరాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రజా ప్రభుత్వం లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను అందించి ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం ఆకాంక్ష అన్నారు.సమాజాన్ని గొప్పగా నడిపించే విధంగా మహిళలుఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి సురేందర్ తాసిల్దార్ మన్నే ఉషా శారద,ఏపీఎం వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు,నాయకులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, శీలం ప్రతాపరెడ్డి,బండారు నరసింహారావు,వేజెండ్ల సాయికుమార్,కడియం శ్రీనివాసరావు,బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,శీలం శ్రీనివాస్ రెడ్డి,మల్లెల లక్ష్మణరావు, షేక్ ఇస్మాయిల్,గంటా తిరుపతమ్మ,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

- నా మృతికి పోలీసు ఉన్నతాధికారులే కారణం అంటూ సెల్ఫీ వీడియో
- నా కుమారుడు మృతికి కారణమైన పోలీసులను సస్పెండ్ చేయాలి



**ఏనుకూరు, నవభూమి, అక్టోబర్ 13 :** ఏనుకూరికి చెందిన భూక్య సాగర్ అనే కానిస్టేబుల్ హైదరాబాదులో హాస్పిటల్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి .ఏనుకూరుకు చెందిన భూక్య సాగర్ అనే కానిస్టేబుల్ బూర్గంపాడు లో విధులు నిర్వహిస్తూ పలు కారణాలతో గత ఆరు నెలల క్రితం సస్పెండ్ అయ్యాడు. అప్పటినుండి ఇంట్లోనే ఉంటున్నాడు. నా సస్పెన్షన్ బూర్గంపాడు పరిధిలోని సిఐ తో పాటు ఇద్దరు ఎస్ఐలు మరో వ్యక్తి కారణమంటూ సెల్ఫీ వీడియో తీసుకొని శనివారం 11 గంటల సమయంలో ఏన్కూర్ లోని సాగర్ కాలువ సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడినుండి నడుచుకుంటూ వచ్చి ఏనుకూరులోని ప్రైవేట్ ఆసుపత్రి చేరాడు. దీంతో ఆసుపత్రి వారు ప్రాథమిక వైద్యం చేసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఏనుకూరు నుండి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో రాత్రి పది గంటల సమయంలో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఐదు గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. సాగర్ 2013లో కానిస్టేబుల్ గా ఉద్యోగం పొందాడు. బూర్గంపాడు లో విధులు నిర్వహిస్తూ పలు కారణాలతో సస్పెన్షన్ గురయ్యాడు. అప్పటినుండి కొంత మానసిక వేదన చెందాడు. మనోవేదనతో ఉన్న సాగర్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తండ్రి భూక్య కిషన్ తెలిపాడు. నా కుమారుడు సస్పెన్షన్కు కారణమైన పోలీసు ఉన్నతాధికారులపై విచారణ చేసి సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. మృతునికి భార్య తేజస్విని ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు తండ్రి భూక్య కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

### ఆడిపాడిన పాల్వంచ గద్దర్ బాషా





**పాల్వంచ అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** మండల పరిధి లోని కేశవపురం, జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువు తీరిన పెద్దమ్మ తల్లి ఆలయం లో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో చివరి రోజైన శనివారం రాత్రి పాల్వంచ కు చెందిన శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో ఘనంగా ఆట - పాట నిర్వహించారు. ఈ సందర్భంగా గా భక్తి పాటలు, జాన పద గీతాలను ఆలపించారు. గద్దర్ వేషధారణ లో భాష, తెలంగాణ ధూమ్ దాం నిర్వహించి, ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాడు. ఈ కార్యక్రమం ప్రముఖ రంగస్థల నటుడు పాకాల పాటి రోశయ్య చౌదరి, పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు, రంగస్థల నటుడు, గాయకుడు ఖాసిం, స్నేహ, మౌలా, కృష్ణ, సిద్దు, మీరా, రాము, కొండలరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ రైతులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి

**పాల్వంచ అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** పామాయిల్ కు కేంద్ర ప్రభుత్వం తక్షణం మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అశ్వారావుపేటలో శనివారం జరిగిన పామాయిల్ రైతుల సదస్సులో మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులతో పాటు కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల ను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సన్మానించారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ అశ్వారావుపేట కేంద్రంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే పామాయిల్ పండించే రైతులు ఎక్కువగా వున్నారని, వారికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచి, వారిని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే హన్మంతరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, చౌగాని పాపారావు, పాల్గొన్నారు.





## 16 నుంచి వేట వెంకటేశ్వరస్వామి

# బ్రహ్మోత్సవాలు

**గార్ల, నవభూమి, అక్టోబర్ 13:** కోరిన వారి కొంగుబంగారంగా వాసికెక్కిన గార్ల శ్రీ వేట వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి 22 తేదీ వరకు నిర్వహించనున్నారు. గార్ల పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని మర్రిగూడెం సమీపంలో వెలసిన శ్రీ వేట వెంకటేశ్వర స్వామికి ప్రతియేటా ఆశ్వీయుజ మాసంలో వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి స్వయంగా వేట కోసం ఈ ప్రాంతానికి విచ్చేసి ఇక్కడ అవతరించి నట్టుగా భక్తుల విశ్వాసం. తాము కోరుకున్న కోర్కెలు తీర్చే వెంకటేశ్వరుడు అంటూ భక్తులు నమ్ముతూ మద్యం, మాంసాన్ని నైవేద్యంగా పెట్టి తమ మొక్కులను తీర్చుకుంటారు. సుమారు 500 సంవత్సరాల క్రితం పూర్వం ఈ ప్రాంతానికి చెందిన రామాయణం వెంకయ్య అనే పేద చాత్తద వైష్ణవుడికి దర్శనమిచ్చి ఇక్కడ తనకొక ఆలయాన్ని నిర్మించి నిత్య, ధూప, దీప నైవేద్యాలతో ఆరాధించమని ఆజ్ఞాపించి నట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. వెంగళయ్య ద్వారా తన కోరికను స్వామి గ్రామ ప్రముఖులకు వివరించి శిలా ప్రవేశం భావించినట్లు నానుడి. కాగా సుందర మూర్తులైన వెంకటేశ్వర స్వామి తో పాటు శ్రీదేవి, భూదేవిల విగ్రహాలు భూపాల్ పట్టణంలోని ఒంటి మీసం తోట అనే ఉద్యానవనంలో లభ్యం కాగా అక్కడినుంచి పొరుగు మండలమైన డోర్నకల్ సమీపంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన మల్లెం గోపయ్య, మల్లెం నర్సయ్య లు గార్లకు తరలించి ఇక్కడ ప్రతిష్టించారు. నాటి నుంచి వంశపారంపర్యంగా ఇదే కుటుంబానికి చెందిన వారు స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు తీసుకొస్తారు. భక్తుల అభీష్టాలను తీర్చే పవిత్ర యాత్రాస్థలం గా విలసిల్లుతున్న ఈ దేవాలయానికి చెందిన స్వామివారి ఉత్సవ విగ్రహాలకు రక్షణ కొరవడంతో ఉత్సవాల తర్వాత గార్లలోని మూల విరాట్ దేవాలయంలో భద్రపరుస్తారు. ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, మహబూబాబాద్, నల్గొండ జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు హాజరై తమ ఇష్టదైవానికి మొక్కులు చెల్లించుకుంటారు. గతంలో పదిహేను రోజులపాటు ఉత్సవాలను జరిపేవారు. ఏటేటా ఆదరణ తగ్గిపోవడంతో ఉత్సవాలను వారం రోజులకే పరిమితమయ్యాయి. ఆశ్వీజ పౌర్ణమి నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఈ నెల 16 నుంచి 22 తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తారు. 16వ తేదీన విష్వక్సేన పూజ, అంకురార్పణ, 17న ఉదయం గరుడ ముద్ద, సాయంత్రం 4-05లకు స్వామివారి కల్యాణం, రాత్రికి హొూమ బలి హోరం, 18న హొూమ బలి హోరణ, హనుమంత సేవ,19వ గరుడ సేవ, 20న సాయంత్రం తెప్పోత్సవం, 21న పార్వేట అశ్వ వాహన సేవ,22న







దోపోత్సవం, శ్రీ చక్ర స్నానం, రాత్రి కి నాగబలి, శ్రీ పుష్పయాగం తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వజస్తంభం కూలీ పోగా నూతన ధ్వజస్తంభం తో పాటు ఆలయం చుట్టూ భక్తుల ఆర్థిక విరాళాలతో అధునాతనంగా ప్రాకారాలను నిర్మాణం చేశారు. భక్తులకు ఇబ్బందులు పడకుండా సత్రాలు, హోళ్లు దాతలు నిర్మించారు.

## ములకలపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే



**ములకలపల్లి అక్టోబర్ 13 నవభూమి:** ములకలపల్లి మండలంలో పలు శుభకార్యములలో పాల్గొన్న అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ. ముందుగా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రాయల్ ఫంక్షన్ హాల్ ను యాజమాన్యం ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ. ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పాన్ షాప్ శ్రీను సతీమణి రమాదేవి, మండల కేంద్రంలో ప్రముఖ వ్యాపారి బిక్కుమళ్ల సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్లో ట్రీట్మెంట్ పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తిమ్మంపేట గ్రామంలో తాండ్ర ప్రభాకర్ తమ్ముడు తాండ్ర శ్రీనివాసరావు. మనవరాలు ఓణీల వేడుకకు హాజరై చిన్నారిని దీవించారు. పొగల్లపల్లి గ్రామంలో ఇటీవల వివాహం జరిగిన కొమ్మరాజు శ్రీనివాసరావు కుమార్తెను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాలకుర్తి రత్న భూషణం వాళ్ల ఇంటి దగ్గర టీ తేనీటి విందులో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి బాబు, మాజీ సర్పంచ్ కారం సుధీర్,గాడి తిరుపతి రెడ్డి, సురభీ రాజేష్, శనగపటి రవి, పాలకుర్తి సుమీత్, మడకం చిరుమప్ప, ముదిగొండ శివ, దుగ్గి సంపత్ కుమార్ సోయం నాగరాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# కోటమైసమ్మ తల్లికి మొక్కు చెల్లించిన ఎమ్మెల్యేలు

**కారేపల్లి,నవభూమి,అక్టోబర్13 :** మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఐదు రోజులు పాటు రాత్రి పగలు నిరంతరం జరిగే ఈ జాతర కు జనం తరలివస్తున్నారు. రెండోవ రోజు ఆదివారం అమ్మవారిని దర్శనానికి జనం క్యూ కట్టారు. ఆలయ వద్ద వాహన పూజకు విశేష ప్రాముఖ్యత ఉండటంతో భక్తులు వాహనలకు పూజ చేయించుకోవటానికి అధికంగా పోటీలు పడ్డారు. వాహన పూజకు భక్తులు అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో దేవదాయశాఖ దానికి అనుగుణంగా ఏర్పాట్లను చేసింది. వాహన పూజకు ప్రత్యేకంగా అర్చకులను నియమించారు. జాతరలో ఏర్పాటు చేసిన వినోద సాధనాల్కైన జాయింట్ విల్స్, కొలంబో, సోలంబో, క్రాస్ వీల్, డ్రాగన్ ట్రైన్ వంటి వాటిలో విహరిస్తూ యువత కేరింతలు కొట్టారు. జాతరలో బూరల హెూరు, యువత ఈలల శబ్దంతో జాతర ప్రాంగణం సందండిగా మారింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రస్తూ వాహనాలను పోలంపల్లి క్రాస్ రోడ్‌లోని కోటమైసమ్మ తల్లి ఆర్చి వద్దనే వాహనాలను నిలిపి వేస్తున్నారు. అక్కడి నుండి భక్తులు నడకనే రావాలని కోరుతున్నారు. జాతరలో ఆవాంచనీయ ఘటనలు జరగకుండా 24 గంటలకు ప్రత్యేక పోలీసు బంధోబస్తు నిర్వహిస్తున్నట్లు సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు. కారేపల్లి, కామేపల్లి ఎస్సైలు ఎన్,రాజారాం, సాయికుమార్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. జాతరలో అనుమానిత వ్యక్తుల సమాచారంను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జాతరలో వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు నిరంతరం వైద్య సేవలందిస్తుంది.కోటమైసమ్మ తల్లికి మొక్కు చెల్లించిన ఎమ్మెల్యేలు దసరా జాతర సందర్భంగా కోటమైసమ్మ తల్లికి వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, కోరం కనకయ్య లు ఇద్దరు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలకు ఆలయ ఆధికారులు పూర్ణకుంభంతో స్వాగతం ఫలికారు. అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఇన్‌కం ట్యాక్స్ కమీషనర్ లావుడ్యా జీవన్‌లాల్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకోని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కల్గకుండా ఆలయ చైర్మన్ డాక్టర్





పర్సా పట్టాభిరామారావు, ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు దగ్గరుండి జాతరను పర్యవేక్షిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాస శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహిస్తున్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం







**ఏన్కూరు, నవభూమి, అక్టోబర్ 13:** స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ పాఠశాలలో 1999,2000 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. తొలుత అప్పట్లో పనిచేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థులు పాఠశాలలో కలియతిరిగి పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఫోటోలు, సెల్ఫీలు దిగి ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ 1999, 2000 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థిని కమల సులోచన ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేయడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. తమ స్నేహితురాలు ఇదే పాఠశాలలో చదువుకొని మరల ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కమల సులోచన స్నేహితులు శాలువాతో సత్కరించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపసాటి కిషోర్, బుచ్చాల నరేష్, పాముల హరీష్, కృష్ణయ్య, జాగర్లమూడి సురేష్, తాళ్లూరి నవీన్, రమాదేవి, గౌసియా బేగం, రజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితురాలికి గౌసుద్దీన్ సాయం

**కారేపల్లి, నవభూమి ,అక్టోబర్ 13:** కారేపల్లిలో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ గడవటం కష్టంగా ఉన్న కొప్పెర ధనమ్మ కుటుంబానికి బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్, నగదుతోపాటు పాటి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆదివారం కారేపల్లి 1వ వార్డులో ఉంటున్న ధనమ్మ ఇంటికి వెళ్ళిన గౌసుద్దీన్ ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధనమ్మకు ఆర్థిసాయం చేసిన గౌసుద్దీన్ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో వార్డు మాజీ స్యులు గంగరబోయిన సత్యనారాయణ, ఖలీలూల్లాఖాన్, పెద్దలు అబ్దుల్ హయత్, బాణాల రాము, గంగరబోయిన లక్ష్మికాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## నాగుపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారె

◆ **ఫిజియోథెరపీ చేసిన ఎమ్మెల్యే**

**దమ్మపేట అక్టోబర్ 13 నవభూమి:** దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్ ద్వారా విస్తృతంగా పర్యటించి ముందుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పనుగంటి వెంకయ్య, దేశిరెడ్డి మాధవ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వారి నుంచి పలు సూచనలు స్వీకరించారు. అనంతరం మారగాని నాగేశ్వరరావు కి అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం ఒక లక్ష రూపాయలు అవసరమవుగా ఎల్ఓసి మంజూరు చేయించి ఆ చెక్కును వారికి ఇంటికెళ్లి అందించారు. అనంతరం పెరాలసిస్ తో బాధపడుతున్న ఆంగోతు రాంబాబు ని పరామర్శించి వారికి స్వయంగా ఫిజియోథెరపీ చేశారు. అదే గ్రామంలో పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ హాస్పటల్లో ట్రీట్మెంట్ పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇస్లావత్ నాగేశ్వరరావు, చల్లా పున్నయ్య,తూనూరి డేవిడ్, చల్లా బాబురావు ని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలుసుకున్నారు ఇంకా ఏదైనా వైద్యం అవసరమైతే తనను సంప్రదించాలని వారికి భరోసాఇచ్చారు. అలాగే ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నూజివీడు విజయలక్ష్మి, రంగు మాధవాచారి కి అందించారు. అలాగే ధారావత్ ప్రసాద్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు.





## ప్రసన్నాంజనేయ ఆలయ పునః ప్రతిష్ఠ శంకుస్థాపన

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల





**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 13 :** పట్టణ పరిధిలోని హనుమాన్ నగర్ లో 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం పునః నిర్మాణ ప్రతిష్ట కు శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఉదయం 7 గంటల 50 నిమిషాలకు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్రాహ్మణోత్తముల వేదమంత్రాలు, పూజా క్రతువుల నడుమ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, డాక్టర్ తుమ్మల యుగంధర్, పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో ఘన చరిత్ర కలిగిన హనుమాన్ నగర్ ఆంజనేయస్వామి పునః ప్రతిష్ట శంకుస్థాపన కు హైందవ భక్తులు భారీగా తరలివచ్చారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, గాదె చెన్నకేశవరావు, మందపాటి రవీందర్ రెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, బత్తుల భరత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ తోట సుజలరాణి గణేష్, కౌన్సిలర్లు ధూళిపాల రాంబాబు, మందపాటి పద్మ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి

**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.




# ప్రజలకు అండగా ఉంటాం: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- నాడు ఎన్టీఆర్ నాటిన పామ్ ఆయిల్ మొక్క నేడు దశ దిశలా వ్యాపించింది
- డిసెంబర్ లోపు ఋణమాఫీ పూర్తీచేస్తాం:మంత్రి తుమ్మల







**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో 36.5 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్ ను శనివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి విజయదశమి ఇదని,రాష్ట్ర ప్రజలు విజయాలు పొందే విధంగా ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇస్తున్నామన్నారు. దసరా బహుమతిగా పామాయిల్ కర్మాగారం లో పవర్ ప్లాంట్ ప్రారంభించడం ఆనంద దాయకంగా ఉందన్నారు.ప్రపంచం మొత్తం థర్మల్ పవర్ నుండి గ్రీన్ పవర్ వైపుగా అడుగు లు వేస్తోందని, రాబోయే ఐదేళ్ళల్లో తెలంగాణా లో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి దిశగా కసరత్తు చేస్తున్నామన్నారు.నేదురుమల్లి జనార్ధన రెడ్డి 1990 లో పామాయిల్ సాగు కోసం ఆలోచన చేశారు. మలేషియాకు ఇక్కడి బృందాలను పంపి పామాయిల్ తీసుకువచ్చే ఏర్పాట్లకు పునాది నాడే పడింది. దిగుమతి కి కస్టమ్స్ డ్యూటీ 28 శాతం పెంచి మన పామాయిల్ కు మద్దతు ధర దిశగా చర్యలు తీసుకున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 73 వేల కోట్లు కేటాయించమని, రెండు లక్షల రుణ మాఫీ 18 వేల కోట్లు 15 రోజుల్లోనే వేసి చరిత్ర సృష్టించామని చెప్పుకొచ్చారు. గత బీఆర్ఎస్ పాలకులు అరకొర ఋణమాఫీలు చేసి చేతులు దులుపున్నారని, ఇప్పుడొచ్చి తగుదునమ్మా అని తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఏద్దేవా చేశారు. ఏ వెసులుబాటు వున్నా మిగిలిన రైతులకు కూడా మాఫీ చేస్తాం,భవిష్యత్ లో రైతులకు పంట భీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే కడుతుంది, రైతు గౌరవంగా నిలబడే ల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పైలట్ ప్రాజెక్టు లు తీసుకుని పొలాల్లో సోలార్ పంప్ సెట్ లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ నిధులతో ఇళ్లపై కూడా సోలార్ పెట్టుకునేలా ఆలోచన చేస్తున్నామని, అశ్వారావుపేట ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్ గా రెండు గ్రామాలను తీసుకుని సోలార్ ప్రాజెక్టు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.రైతులకు రుణమాఫీ లో సాంకేతిక కారణాలు ఏమున్నా సరిచేసి మాఫీ చేస్తామన్నారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ....మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 1986 లో ఎన్టీఆర్ పెదవేగి లో మొక్క నాటారని .1990 తర్వాత తెలంగాణ లో వేశామని వివరించారు. హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో పామాయిల్ సాగుకు అనుమతులు వచ్చాయని,టన్ను రూ 20 వేలు ఉండేలా దృష్టి పెడతామని తుమ్మల చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల అధినేతలతో కలిసి కేంద్రం దగ్గరకి వెళతాం,వచ్చే నెలలో మరో 1300 పెరుగుతుంది,రాహుల్ గాంధీ సారథ్యంలో 20 వేలు కంటే ఎక్కువ వచ్చేలా ప్రణాళిక చేసుకుందామన్నారు.కొత్తగూడెం జిల్లాలో పట్టా ట్రాన్స్ఫర్ లు ఉండవు గనుక భూమి ఉన్న ప్రతి రైతుకు పామాయిల్ మొక్క అందేలా రెవెన్యూ మంత్రి చర్యలు తీసుకోవాలి, ఆంధ్రా లో నర్సరీ లకు విద్యుత్ పరంగా ఉన్న విధి విధానాలు అశ్వారావుపేట నర్సరీలకు ఇవ్వాలని, రైతులకు ఇవ్వాలని విద్యుత్ శాఖను కోరుకుంటున్న అన్నారు.అన్నమాట ప్రకారం రైతు భరోసా ఇచ్చే ఏర్పాటు చేశాం, తల తాకట్టు పెట్టి అయినా పంట భీమా పథకం ఇప్పిస్తాం, డిసెంబర్ 9 లోపు రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జీతేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, సింగరేణి సీఎన్ఎండి బలరాం, మ్మెల్యేలు జారే ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమై, రాందాస్ నాయక్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.













# శ్రీ వేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 12 :** మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి సేవ సమితి ఆధ్వర్యంలో దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మల దంపతుల సహకారంతో దసరా పండుగ సందర్భం గా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించి నట్లు సేవా సమితి బాధ్యులు బి ప్రసాద్,ఎల్వి నారాయణరెడ్డి తెలిపారు. ఖమ్మం పట్టణానికి చెందిన కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్ళూరి కోటేశ్వర రావు,నిర్మలకుమారి దంపతులు అన్నదాన కార్యక్రమానికి సహకరించారని వారి సోదరులు పురుషోత్తం రావు,రాజ్యలక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమానికి ప్రారంభించారని సేవాసమితి సభ్యులు తెలిపారు.వెంకటేశ్వర సేవా సమితి ద్వారా అన్నదానం చేయాలను కునే దాతలు ఎవరైనా ఉంటే ప్రతి శనివారం వారి పేరు మీద భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సేవా సమితి సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఈ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తూన్నామని అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నదానం చేయటం వల్ల ఆ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు వారి కుటుంబాలపై ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు బి ప్రసాద్, కార్యదర్శి ఎల్.వి. నారాయణరెడ్డి,కోశాధి కారి వీరమాచనేని వెంకటకృష్ణ,తుళ్ళూరి పురుషోతమరావు, రాజ్యలక్ష్మి,మాజీ ఈవో అల్లూరి విష్ణుమూర్తి,సేవ భక్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు సంఘం నేతకు మాతృ వియోగం

## నివాళులర్పించిన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా

**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజె 143 జిల్లా అధ్యక్షులు, జర్నలిస్టు కల్లోజి శ్రీనివాస్ తల్లి కళ్ళొజి జయమ్మ (80) కొత్తగూడెం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. హేమచంద్రపురం లోని కల్లోజీ స్వగృహం వద్ద జయమ్మ మృతదేహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబిర్ పాషా సందర్శించి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. జయమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, గేద్దాడు నగేష్, నేరేళ్ల రమేష్, రాజు, యెల్లావుల ఉపేందర్ తదితరులు ఉన్నారు.



# మరణించినా జీవించే ఉన్న వ్యక్తి సాయిబాబా

## ఇల్లెందులో ఘనంగా నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి



**ఇల్లెందు టౌన్ాఅక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** ప్రొఫెసర్ సాయిబాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా వారి ఆలోచన, ఆశయాలతో మన మధ్య జీవించే ఉంటారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు లో మాజీ జడ్పీటీసీ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ తో కలిసి ప్రొఫెసర్ సాయిబాబా కు ఘనంగా నివాళులు అర్పించారు. సాయిబాబా బ్రతికున్నంత కాలం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం తపించిన వ్యక్తి, గొప్ప ప్రజా స్వామిక ఆలోచనాపరులు అని వారన్నారు. సాయిబాబా గొప్ప కమ్యూనిస్ట్ మేధావి సోషలిస్ట్ హ్యూమనిస్ట్ సమాజాన్ని సాధించడానికి కట్టుబడి ఉన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వానికి బద్ధ శత్రువులైన కార్పొరేట్ పెట్టుబడిదారీ - భూస్వామ్య భారత పాలక వర్గాలు, వారి పెద్దన్న సామ్రాజ్యవాదం ప్రొఫెసర్ సాయిబాబా యొక్క విప్లవాత్మక మనస్సుకు తీవ్రంగా భయపడ్డారని అన్నారు. వారు అతనిని ఉపా చట్టం కింద తప్పుడు కేసులో ఇరికించారని, న్యాయవ్యవస్థ కార్యనిర్వాహకవర్గానికి దాసోహం చేస్తూ 90 శాతం శారీరక వికలాంగుడైన సోషలిస్ట్ స్వాప్నికుడు, మేధావి సాయిబాబాకు జీవిత ఖైదు విధించిందని అన్నారు. 10 సంవత్సరాల ఏకాంత నిర్బంధం తర్వాత, బాంబే హైకోర్టు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసును పునఃపరిశీలించిందని, ఇంటర్నెట్ నుండి మావోయిస్టు సాహిత్యాన్ని డౌన్‌లోడ్ చేయడం చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను అనుమతించదని ప్రకటించింది. జైలు శిక్ష తీర్పును కొట్టివేసి, సాయిబాబాను 2024 మార్చిలో జైలు నుండి విడుదల చేసిందని తెలిపారు. 10 సంవత్సరాల జైలు శిక్షలో ప్రొఫెసర్ సాయిబాబా కు అవసరమైన మందులు అందించలేదు. అందువల్ల అతని ఆరోగ్యం బాగా క్షీణించింది. అతని ఉక్కు సంకల్పం వల్ల అతను జైలు అమానుషం జీవితం తట్టుకొని బ్రతికాడు. జైలు నుండి విడుదలైన 6 నెలల తర్వాత అతను మరణించినప్పటికీ సాయిబాబా కు నిరసన సమావేశాలు నిర్వహించడం ద్వారా సాయిబాబాను స్మరించుకోవాలని గుమ్మడి, చంద్ర అరుణ లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సాయిబాబా కుటుంబానికి బంధుమిత్రులకు విప్లవ శ్రేణులకు సంతాప సానుభూతిని తెలియజేశారు.

# అనారోగ్య సమస్యలతో దంపతుల ఆత్మహత్య

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 13 :** మండల కేంద్రం ఎర్రుపాలెంలో శనివారంరాత్రి అనారోగ్య సమస్యలతో దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసు కుంది.ఎస్సై పి వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎర్రుపాలెంలో నివాసం ఉంటున్న రేమిడిచర్ల గ్రామానికి చెందిన సీనియర్ మండల కాంగ్రెస్ నాయకుడు ధనేకుల సాంబశివరావు (72) అతని భార్య ధనేకుల సరోజిని (65) అనే దంపతులు అనారోగ్య సమస్యలతో పలు ఇబ్బందులు పడుతూ తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసిపెట్టి తమ స్వగృహంలో శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నా రన్నారు.కేసు నమోదు చేసి మృత దేహాలకు పోస్ట్ మార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.రాత్రి వరకు తమతో మాట్లాడిన భార్యాభర్తలు ఇద్దరు విగత జీవులుగా ఉండటం చూసి చుట్టుపక్కల వారు చలించిపోయారు.ఈ విషాద సంఘటన పట్ల పలువురు రాజకీయ నాయకులు,గ్రామస్తులు తమ ప్రగాఢ సంతాపాన్ని సాంబశివరావు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.



# మద్యానికి బానిసై వివాహితుడు ఆత్మహత్య



**ములకలపల్లి అక్టోబర్ 13 నవభూమి:** ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన ఓకే వెంకటకృష్ణ గత ఆరు నెలల నుంచి మద్యానికి బానిసై మద్యం త్రాగి వచ్చేవాడని కుటుంబ సభ్యులు చెప్పిన వినిపించుకోక పోగా కుటుంబ సభ్యులు తాగవద్దని ఆరోగ్యం పాడవుతుందని మందలించడంతో మనస్థాపానికి గురై క్షణికావేశంలో ఉరి వేసుకుని చనిపోయినాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కిన్నెర రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అణగారిన వర్గాల సేనాని సాయిబాబా

## సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా

**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి :** అణగారిన వర్గాలను పోరాటం వైపు నడిపించిన సేనాధిపతి సాయిబాబా అని, ఆయన మృతి పౌరహక్కుల ఉద్యమానికి తీరని లోటని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా అన్నారు. పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ సాయి బాబా మృతిపై ఆదివారం ఆయన స్పందిస్తూ సాయిబాబాది సాధారణ మృతికాదని కేంద్రం చేసిన హత్య అని ఆరోపించారు. 90 శాతం అంగవైకల్యంతో ఉన్న ఆయనపై నక్సలైటుగా ముద్రవేసి ఉపా చట్టం క్రింద ఏండ్ల తరబడి జైల్లో పెట్టి దుర్మార్గంగా వ్యవహరించిందని, అందువల్లే ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించి మృతిచెందారన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సాయిబాబా పోరాడాడని, వికలాంగులకు, దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాలకు అండగా, వారి హక్కులకోసం పోరాడిన సాయిబాబా మృతి ప్రజా పోరాటాలకు తీరనిలోటని, ఆయన మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా సతీమణి ని పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా సతీమణి వసంత ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలకొండ కాంతయ్య, మారుపాక అనిల్ కుమార్, టీపీఎఫ్ నాయకులు రవిచంద్ర తదితరులు ఆదివారం పరామర్శించారు.





## జమ్మి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని





**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం రైటర్ బస్తీలో దసరా పండుగ సందర్బంగా శనివారం రాత్రి జరిగిన జమ్మి పూజా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. డి ఎస్పీ రెహమాన్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడికి పరామర్శ



**ఖమ్మం రూరల్, నవభూమి, అక్టోబర్ 13:** మండలంలోని కామంచికల్లు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు మేదరమట్ల వెంకట రామ నరసయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హాస్పటల్లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఆదివారం విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్ వెంకట రామ నరసయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో శరీరం సహకరించే వరకు తగు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, జిల్లా నాయకులు హనుమంతు రాము, మాజీ ఎంపీటీసీ కళింగి మోహన్ రావు, మండల నాయకులు వెంకటకృష్ణ, చెరుకూరి ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

## కల్లోజి జయమ్మకు జర్నలిస్టుల నివాళి

**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** ప్రముఖ జర్నలిస్ట్ నేత కల్లోజీ శ్రీనివాస్ మాతృమూర్తి జయమ్మ మృతికి జర్నలిస్ట్ రాజేందర్, వహాబ్ తదితరులు ఘనంగా నివాళి అర్పించారు.



## విజయదశమి సందర్భంగా శ్రీనగర్ కాలనీ పంచాయతీ

### పారిశుద్ధ్య సిబ్బందికి నూతన వస్త్రాల వితరణ



**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి ప్రతినిధి:** స్వర్గీయ బత్తుల సరోజిని జ్ఞాపకార్థం శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీనగర్ అధ్యక్షులు బత్తుల కృష్ణయ్య పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేసి మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ప్రతిరోజు ఇంటింటికి తిరుగుతూ చెత్తని సేకరిస్తూ మురుగునీటి కాలువలని శుభ్రపరుస్తూ ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ఎంతో శ్రమిస్తున్నారని వారి యొక్క శ్రమను గుర్తించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని సమాజ బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాళ్లూరి వెంకటేశ్వరరావు, లైన్స్ క్లబ్ సభ్యులు కోనేరు పూర్ణచంద్రరావు లగడపాటి రమేష్ చంద్, వట్టి కొండ సాంబశివరావు, శివ, వీరభద్రం డాక్టర్ రామారావు, రామచంద్ర కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, నూకల ప్రవీణ్ పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితుని ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే రాందాస్



**జూలూరుపాడు,అక్టోబర్ 13 (నవభూమి ప్రతినిధి)** మండల పరిధిలోని గుండెపుడి గ్రామానికి చెందిన భూక్య నరేష్ గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.అందుకు వైద్యం కోసం అప్పులు చేసి చికిత్స పొందుతూ వున్నారు.అయినప్పటికి వ్యాధి ముదిరి తీవ్ర అనారోగ్యంతో జిల్లా యువజన నాయకులు దొండపాటి శ్రీనివాసరావు (వాసు) ను సహాయం కోసం సంప్రదించారు.వెంటనే స్పందించిన వాసు విషయాన్ని వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు.తక్షణమే ఎమ్మెల్యే 1,25,000 వేల రూపాయలకు ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి ఎల్ ఓ సి మంజూరు చేయించి శుక్రవారం వైరా క్యాంప్ కార్యాలయంలో బాధితుని అందజేశారు.ఈ కార్య క్రమంలో యువజన నాయకులు దొండపాటి శ్రీనివాసరావు (వాసు),మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్,నర్వనేని పుల్లారావు,వేల్పుల నరసింహారావు,నవీన్ రాథోడ్,మిరియాల కిరణ్ కుమార్,ఉశికళ వెంకటేశ్వర్లు,మల్కం వీరభద్రం, మాడుగుల నాగరాజు, కొర్సా రమేష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం కార్య క్రమాన్ని ప్రారంభించిన సిఐ ఇంద్ర సేనారెడ్డి

**జూలూరుపాడు,అక్టోబర్ 13 (నవ భూమి ప్రతినిధి)** మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నందు ఈ నెల 3వ తేదీ నుంచి దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలను నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.అమ్మ వారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆదివారం ఉత్సవాల ముగింపు సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమము నిర్వహించారు.ఈ కార్య క్రమాన్ని స్థానిక సీఐ ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు.నవ రాత్రుల కార్య క్రమాల లో భక్తులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## అమ్మ ఫౌండేషన్ చైర్మన్‌కు పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంగీలాల్



**జూలురుపాడు,అక్టోబర్ 13 (నవభూమి ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని ని ఆదివారం మధిర క్యాంప్ కార్యాలయం నందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి విజయ దశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్య క్రమంలో జిల్లా టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్,మండల ఓబిసి సెల్ అధ్యక్షులు గోపు రామకృష్ణ, మండల సేవాదళ్ అధ్యక్షులు వాంకుడోత్ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ దేవి నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**రుద్రంపూర్ అక్టోబర్ 13 నవభూమి:** శ్రీ శ్రీ శ్రీ దేవి నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టూ టౌన్ ఎస్ హెచ్ ఓ రమేష్ కుమార్, ఐ.ఎన్.టి.యు.సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఎప్పుడైనా సరే చెడుపై మంచి విజయం సాధిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లారపు కొమురయ్య, జానీ, సత్యరాజ్, భీముడు, కవిరాజ్, సమ్మిరెడ్డి, రమేష్, రాజేష్, గుడి కమిటీ సభ్యులు, మహిళలు మిత్రులు, శ్రేయోభిలాషులు, పాల్గొన్నారు.

## ఘనంగా శోభాయాత్ర

**కొత్తగూడెం అక్టోబర్ 13 నవభూమి:** పాల్వంచ గాంధీనగర్ ఐదో వార్డ్ లో వేంచేసి ఉన్న అమ్మవారి మండపంలో అత్యంత వైభవంగా దేవీ నవరాత్రులు పూర్తిచేసుకుని శోభాయాత్ర పురవీధులు కుండా నిమజ్జనానికి తరలి వెళ్లిన అమ్మవారు. ఈ కార్యక్రమంలో కేసు పాక వెంకటేశ్వర్లు, లక్ష్మి, సూరత్, కొత్తపల్లి విజయ్ దుర్గ, సాయికుమార్, రాజేశ్వరి, సంఘమిత్ర, సరోజ, సాహితీ తదితరులు పాల్గొన్నారు



